# సైబర్ వల

## సలీం

ప్రభుత్వోద్యోగాలు గగన కుసుమాలని తెలిపీ, ఆశ చంపుకోలేక వెతికీ వెతికీ విసిగి, చివరికి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగానికి చేరిపోయాను. ఉదయం నుంచీ, సాయంంత్రం దాకా ఊపిరాడని పనీ ... చాలీచాలని జీతం.

నేను చదివిన బి.కాం. పుణ్యం వల్ల రెండు మూడు కంపెనీల్లో పార్ట్ టైమ్ అకౌంటెంట్‌గా కుదురుకున్నాను. సాయంత్రం ఓ గంట ఖాతా పుస్తకాలు రాయటం వల్ల నెలకు నాలుగైదు వందలు ఇస్తారు. తీరిక దొరక్కపోతే ఖాతా పుస్తకాలు ఇంటికి పట్టుకెళ్లి రాసుకుంటాను. ఈ విధంగా వేణ్నీళ్లకు చన్నీళ్లలా నెల తిరిగే సరికి నాలుగు వేలు వస్తున్నాయి.

కొత్తగా పెట్టిన కంప్యూటర్ కంపెనీలో పార్ట్ టైం అకౌంటెంట్ కావాలని ఎవరో చెబితే అడుగుదామని వెళ్లాను. అక్కడ కనిపించాడు వేణు. ప్రాణం లేచి వచ్చి నట్లయింది. ఎన్నాళ్లయిందీ వేణుని చూసి! మే మిద్దరం కలిసే బి.కాం. చదివాం. ఒకర్ని విడిచి ఒకరం ఉండే వాళ్లం కాదు. వేణు ఎం.కాం.లో చేరాడు. డిగ్రీతో నా చదువు ఆగిపోయింది. ఉద్యోగాల వేటలో ఊపిరాడని పని ఒత్తిడిలో మళ్లీ వేణుని కలుసుకునే తీరికే దొరక లేదు. కౌగిలించుకున్నంత పని చేసి 'ఏం చేస్తున్నావు?' అని అడిగాను.



"ఐ.బి.ఎం. మెయిన్ ఫ్రేమ్ నేర్చుకుంటున్నా!' ' అన్నాడు ఉత్సాహంగా.

మధ్యతరగతివాళ్ల మొహాల్లో ఉత్సాహం!! ప్చ్... ఎడారిలో పొడారిపోయిన గొంతుకు ఎదురయ్యే ఎండమావిలా.

"అంటే?" అన్నాను.

"అయ్యో! నీకు తెలియదా? ఈమధ్య పేపర్ చదవటం లేదా?"

లేదు. పేపర్ కొని చదివే తాహతు లేదు. ఏ లైబ్రరీలోనో చదివే తీరిక లేదు. పొట్ట కూటి కోసం పడే తిప్పల్లో, దేశంలో ఏం జరుగుతుందో

తెలుసుకోవాలన్న జిజ్ఞాస చచ్చి పోయి చాలా కాలమైంది.

"అమెరికాలో లక్షలకు లక్షలు సంపాదించిపెట్టే తారకమంత్రం ఐ.బి.యం. మెయిన్ ఫ్రేమ్ అంటే' ' అన్నాడు వేణు.

'లక్షలకు లక్షలు' అనే మాట నా మధ్య తరగతి మనసుకు అమృతపానంలా ఉంది. ఆకలితో అలమటించే వాడికి అక్క డెక్కడో పరమాన్నం పంచుతున్నా రన్న వార్తలా మధురంగా ఉంది.

"వివరంగా చెప్పు" అన్నాను.

"నీకు 'వై 2 కె' సమస్య అంటే ఏమిటో తెలుసా?"



తెలియ దన్నాను. నాకు నాన్నగారి ఆరోగ్యం సమస్య, తమ్ముడి చదువు సమస్య, ఇంట్లో ఆకలి సమస్య తప్ప ఇటువంటి సమస్య గురించి తెలియదు.

"అయితే నీకు క్లాస్ తీసుకోవాల్సిందే. ఇక్కడ కాదు, ఏదైనా హోటల్లో చాయ్ తాగుతూ మాట్లాడుకుందాం, రా!" అంటూ ఓ ఇరానీ హోటల్‌కు లాక్కెళ్లి కూర్చోబెట్టాడు.

అతని మొహం దివ్యతేజస్సుతో వెలుగుతోంది. కురుక్షేత్రంలో గీతోపదేశం చేస్తున్న కృష్ణపరమాత్ముడిలా పోజు పెట్టాడు. నేను ఒళ్లంతా చెవులు చేసుకుని కూర్చున్నాను.

'ప్రపంచ కంప్యూటర్ రంగంలో ప్రకంపనలు రేకెత్తిస్తున్న మిలినియమ్ బగ్ వై2కె సమస్య. మొట్టమొదట రూపొందించిన కంప్యూటర్ల పరిమాణం పెద్దది. అందుకే వాటిని మెయిన్ ఫ్రేమ్ కంప్యూటర్లు అన్నారు. ఈ కంప్యూటర్ల తయారీలో మకుటం లేని మహారాజులా వెలుగొందుతున్న సంస్థ ఐ.బి.ఎం. - ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్.'

"నా కిదంతా ఎందుకు? నీవు చెప్పిన 'శతాబ్దపు పురుగు' ఏమిటో చెప్పు, చాలు!" అన్నాను అసహనంగా.

వేణు గర్వంగా నవ్వి, "అక్కడికే వస్తున్నా. ఆ కంప్యూటర్స్‌లో సంవత్సరాన్ని చివరి రెం డంకెలతోనే ప్రోగ్రాం చేశారు. మరో మూడేళ్లలో 2000 సంవత్సరం వస్తుంది కదా! దీన్ని కంప్యూటర్ 00 సంవత్సరంగా మాత్రమే గుర్తించ గలుగుతుంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే రెం డంకెల సంవత్సరాన్ని నాలు గంకెలుగా మార్చాలి. దాని కవసరమైన కోర్సే నేను నేర్చుకుంటున్నది - మెయిన్ ఫ్రేమ్ కోబాల్, డిబి-2, సి.ఐ.సి.ఎస్. కోర్సులు."

"రెం డంకెల సంవత్సరాన్ని నాలు గంకెలుగా మార్చటానికి ఇంత హైరానా పడాలా? అమెరికన్లు చూసుకోలేరా? మన మెందుకు?" అన్నాను.

పల్లెటూరి బడుద్దాయిని పట్నం కుర్రాడు చూసినట్లు చూశాడు వేణు.

"ఆ కంప్యూటర్లలో ఉన్న ప్రోగ్రామింగ్ కోడ్ కొన్ని బిలియన్లలో ఉంటుంది. ఇందులో డేట్‌కి సంబంధించినవి వెతికి, పనితనం చెడకుండా మార్చి కంపైల్ చేయడం అంత సులభం కాదు. దీని కోసం 35 లక్షల మెయిన్ ఫ్రేమ్ ప్రొఫెషనల్స్ అవసరమని అంచనా. ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 17 లక్షల మంది మాత్రమే. నీవు గమనించలేదేమో ... ఈ మధ్య కాలంలో ఇలాంటి కోచింగ్ ఇచ్చే సంస్థలు మన హైదరాబాద్‌లో వందల సంఖ్యలో పుట్టుకొచ్చాయి" అన్నాడు.

"ఇంత కూ మువ్వు చేస్తున్న కోర్సు కెంతవుతుంది?" అడిగాను ఉత్సాహంగా - నాకప్పుడే ఆ కోర్సు చేసేసి ఆకాశంలో ఎగురుతూ

పోయి అమెరికాలో వాలిపోవా లన్నంత ఆరాటం.

"కోర్సు ఎనిమిది వారాలు. ఫీజు నలభై వేలు.'

ఇరానీ హోటల్లో మేఘంలా కమ్ముకున్న సిగరెట్ పొగకో, లేక ఫీజు నలభై వేలని విన్నందుకు ఆశ్చర్యంతోనో పొలమారి దగ్గు తెర వచ్చింది.

"నలభై వేలా ... అమ్మో! అంత డబ్బే?" అన్నాను.

"మరి లక్షలు సంపాదించే ఉద్యోగం. అందునా అమెరికాలో ... ఆ మాత్రం ఖర్చు కాకుండా ఎలా వస్తుంది?" అన్నాడు.

నిజమే కదా అనిపించింది. వేణు వాళ్లింటికి పిలుచుకెళ్లాడు. దిల్‌సుఖ్‌నగర్‌లో రెండు గదులూ, ఓ కిచెన్ ఉన్న చిన్న ఇల్లది. ప్రభుత్వం నుంచి అప్పు తీసుకుని వేణు నాన్నగారు కట్టించుకున్న ఇల్లది. ఆయన ఎలిమెంటరీ స్కూల టీచరు. రిటైర్‌మెంట్ కింకా రెం డేళ్లుంటుందేమో ... వేణుకి పెళ్లి కావాల్సిన చెల్లెలుంది. డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది.

వాళ్లందరి మొహాల్లో వెలుగుతూ ఆశ ... స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ చేతిలో వెలుగుతున్న కాగడాలా.

ఇంటి కొచ్చా నన్న మాటే కానీ మనసు మనసులో లేదు. నాన్న రిటైరై మూడేళ్లు కావస్తోంది. అక్క పెళ్లి కోసం చేసిన అప్పు ఇంకా తీర లేదు. నెల నెలా వడ్డీ కట్టడమే కష్టమవుతోంది. ఎటొచ్చీ తాతగారు వదలి వెళ్లిన అగ్గిపెట్టె లాంటి ఇల్లు మాత్రం మిగిలింది.

నేను దిగులుగా ఉండటం చూసి నాన్నగారు అడిగారు. ఉండబట్టలేక మనసులో దాచుకున్న బాధంతా వెళ్లగక్కాను.

దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, "ఈ కోర్సు చేశాక ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ ఇస్తారా, బాబూ!' ' అని అడిగారు నాన్న.

"మెయిన్ ఫ్రేమ్ శిక్షణసంస్థలే విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సదుపాయాన్ని కలిగిస్తున్నాయి, నాన్నా! అమెరికాకు చెందిన కొన్ని సంస్థలతో వీటికి ఒప్పందా లుంటాయి. ఉద్యోగం గ్యారంటీ, నాన్నా! హెచ్ 1 వీసా కూడా వాళ్లే తెప్పించి ఇస్తారు. మనం హాయిగా వెళ్లి బోల్డన్ని డాలర్లు సంపాదించుకుని రావటమే!" అన్నాను.

ఇంటి కప్పుమీది కెక్కి ఒక్క ఎగురు ఎగిరితే చందమామను అందుకోవచ్చని ఆశ పడుతున్న పసి పిల్లాడి వైపు చూసినట్లు చూశారు నాన్న.

ఎట్లాగైనా నాన్నను ఇంప్రెస్ చేయాలని పట్టుదలతో ఉన్న నేను, "జీతం అయిదారు వేలకు తక్కువ ఉండదు, నాన్నా! అంటే మన ఇండియన్ కరెన్సీలో దాదాపు రెండు లక్షలు!" రెండు లక్షలు అన్న పదాలు ఉచ్చరిస్తేనే ఒళ్లు పులకరించటం నాకు తెలుస్తూనే ఉంది.

"ఇలాంటి సువర్ణావకాశం మళ్లా రాదు, నాన్నా! దీన్ని వదులుకుంటే ఇక జీవితాంతం చిరుద్యోగులుగా, చాలీ చాలని జీతాలతో, తీరీతీరని కోరికలతో జీవచ్ఛవాల్లా ఈ దిక్కుమాలిన దేశంలో మిగిలి పోవాల్సిందే!" అన్నాను.

నాన్నగారు నా వైపు చూసిన చూపులో దుఃఖం, బోలెడంత దిగులు కనిపించాయి. దిక్కుమాలిన దేశం అన్నందు కనుకుంటా. ఆయనకు స్వదేశం మీద మమకారం ఎక్కువ.

"చూడు బాబూ! దూరపు కొండలు నునుపు. తిన్నా, తినకున్నా మన గడ్డ మీద, మన మనుషుల మధ్య బతకటంలో ఉన్న తృప్తి పరాయి దేశంలో ఎన్ని లక్షలు సంపాదించినా రాదు. అయినా కోర్సు ఫీజు నలభై వే లంటున్నావు. అంత తాహతు మన కుందా?" అన్నారు.

"వేణు వాళ్లదీ మన లాంటి పరిస్థితే కదా! వాళ్లమ్మ నగ లమ్మి నలభై వేలు కట్టాడట" అన్నాను ఉక్రోషంగా.

"మనింట్లో అమ్మటాని కేమున్నాయి బాబూ? మిగిలిన అమ్మ నగలు అక్క పెళ్లిలో ఇచ్చేశాం కదా!"

"తాతగా రిచ్చిన ఇల్లుందిగా! అమ్ముదాం. నేను అమెరికా వెళ్తే ఇలాంటి ఇళ్లు ఎన్నైనా కొనవచ్చు!" అన్నాను.

'దిక్కుమాలిన దేశం' అన్నప్పుడు కనిపించిన భావమే 'ఇల్లు అమ్ముదాం' అన్నప్పుడు కూడా కనిపించింది. కళ్లలో కదులుతూ బాధ ...

"ఉన్న దాన్ని వదులుకుని, లేని దాని కోసం వెంపర్లాడటం విజ్ఞత అనిపించుకోదు. అక్కడ దొరికే అయిదారు వేల డాలర్లు మన దేశంలో నీవు సంపాదిస్తున్న నాలుగు వేల కంటే ఎక్కువ కాదు. ఇండియన్ లేబర్నే కాదు, ఇండియన్ మేధావిని కూడా చీప్‌గా కొనుక్కో గలుగుతోంది అమెరికా. మా కాలంలో భారతీయులం అని చెప్పుకోడానికి గర్వపడే వాళ్లం. ఇప్పుడు ప్రవాస భారతీయులమని చెప్పుకోవటం స్టేటస్ సింబల్ అయింది."

"గర్వపడటానికి ఈ దేశంలో ఏముంది, నాన్నా? స్కాములూ, స్వాహాలూ, లీకేజీలు, లంచగొండితనాలు, కష్టపడినా సుఖపడలేక పోవడం, కష్టపడకుండానే కోట్లకు పడగ లెత్తటం ..."

"నిజమే. నేను కాదనను. ఇలా ఉన్న వ్యవస్థని ప్రక్షాళన చేయటానికి పూనుకోవాలి కానీ, దేశాన్ని వదలి వెళ్లిపోతా ననటం ఎంతవరకు న్యాయం?' '


నాకు చిరా కేసింది. "పిల్లలు అభివృద్ధిలోకి రావాలన్న ఉద్దేశం మీ కుంటే కదా?" అన్నాను నిష్ఠురంగా.

ఓ క్షణం ఆయన చూపులో నా మాటలు చేసిన గాయాలు ...

మరుక్షణం వేదాంతిలా నవ్వారు. "నీ ఆశల్ని మొగ్గలోనే తుంపేయటం నా అభిమతం కాదు. నీ ఇష్టం!" అన్నారు.

నిర్ణయాన్ని నాకే వదిలేయటం వల్ల ఉత్సాహం నాలో ...

వేణుతో చెబితో చాలా సంబరపడ్డాడు. "ఇంకేం, మొదట నేను వెళ్లాక, నీవూ వచ్చేద్దువు గాని!" అన్నాడు.



## సాహస బాలలు - 10

# కొలనులో మునిగిన బాలుని వెలికితీసిన నరేష్‌కుమార్



మణిపూర్ రాష్ట్రంలోని తౌబర్ గ్రామంలో నివసిస్తున్న నరేష్‌కుమార్ సింగ్ అనే పన్నెండేళ్ల బాలుడు 1995 నవంబరు 19న తన తల్లితో కలిసి ఆ గ్రామంలోనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ వారంతా కలిసి వారి కుటుంబంలో జరిగిన ఒక పెళ్లిలో తీసిన వీడియో కాసెట్‌ను పెట్టుకుని టి.వి. చూస్తున్నారు.

అంతలో ఆ ఇంటి దగ్గరగల కొలనువైపు నుంచి ఏదో నీట మునిగిన బుడుంగు శబ్దం నరేష్‌కుమార్ చెవిన పడింది. వెంటనే అతను బయటకు వచ్చి విచారించగా, అంతకుముందే అక్కడ కెన్నడీ అనే రెండేళ్ల బాలుడు ఆడుకుంటూ ఉన్నాడని, కానీ కొంచెం సేపటి నుంచి కనిపించడంలేదని తెలిసింది. దానితో ఏదో ప్రమాదం జరిగి ఉంటుందని గ్రహించిన నరేష్‌కుమార్, మరేమీ ఆలోచించకుండా పరుగెత్తుకుని పోయి ఆ కొలనులో దూకేశాడు. అప్పటికే మునగానాం, తేలానాం అవుతున్న పసిబాలుడు నరేష్ కుమార్ తన దగ్గరకు చేరుకోగానే భయంతో అతని మెడను గట్టిగా పట్టుకున్నాడు. ఒకరి బరువుకు మరొకరి బరువు తోడవడంతో ఇద్దరూ కొలను అడుగు భాగం వైపు మునిగిపోసాగారు. అయినప్పటికీ నరేష్‌కుమార్ ధైర్యాన్ని వీడకుండా అత్యంత కష్టంమీద నీటిపైకి తేలియాడి, పసిబాలుడు కెన్నెడీని పట్టుకుని ఒడ్డుకు ఈదుకువచ్చాడు.

ఆ పసివాడు అప్పటికే స్పృహ కోల్పోయి ఉండగా, నరేష్‌కుమార్ ఆ కుర్రవానిని పడుకోబెట్టి, పొట్ట ఒత్తి వాడు మింగిన నీటిని కక్కించి, కృత్రిమ శ్వాస కూడా కల్పించాడు. అంతలో ఆ దారిన పోయేవారు అది గమనించి ఆ బాలు రిద్దరినీ ఆ గ్రామంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకుపోయి తగిన చికిత్స చేయించారు. నరేష్‌కుమార్ చూపిన సమయస్ఫూర్తి, చొరవ వలన ఒక పసిబాలుడు బతికి బయటపడ్డాడు.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

అప్పటి నుండి శ్రద్ధగా ఐ.బి.ఎం. మెయిన్ ఫ్రేమ్ గురించి వివరాలు సేకరించటం ప్రారంభించాను. ఈ కంప్యూటర్లన్నీ కోబాల్ భాషలో పనిచేస్తాయి. మొదట తయారైన మెయిన్ ఫ్రేమ్‌లే మినీలుగా మారి, మినీలు పీసీలుగా రూపాంతరం చెందాయి.

వేణు కోర్స్ పూర్తయింది. అమెరికాలో ప్లేస్‌మెంట్ కోసం హిమాయత్ నగర్‌లో ఉన్న ఓ ఏజెంట్‌ని కలుసుకోమంటే - నేనూ, వేణూ కలిసి వెళ్లాం. వీళ్లని ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్స్ అనీ, బాడీ షాపర్స్ అనీ అంటారట.

"అమెరికాలో ప్రాజెక్ట్ లీడర్ మా బ్రదర్ - సీతారాంరావు. మీకు ఉద్యోగం హండ్రెడ్ పర్సంట్ గారంటీ. ఎటొచ్చీ మీకు వచ్చే జీతంలో నలభై శాతం మీ రక్కడి ఏజెంట్‌కు ఇవ్వాల్సి వస్తుంది" అన్నాడు.

ఆ మాట వినగానే సగం క్రుంగిపోయాను. మనం కష్టపడి సంపాదించిన దాంట్లోంచి నలభై శాతం వా డెవడికో ఇవ్వాలా? ఇండియా నుంచి నిపుణుల్ని సమకూర్చినందుకు అమెరికా సంస్థ నుంచి ఎలాగూ కొంత కమీషన్ వీళ్లకు ముడుతుంది. దాంతో సరిపెట్టుకోక ... వీళ్ల బాడీ షాపర్సా, నిరుద్యోగుల బాడీ ఈటర్సా...?

"మీకు హెచ్1 వీసా తెప్పించే బాధ్యత నాది. దానికీ, అమెరికాలో ఉద్యోగం ఖరారు చేసినందుకూ నాకు మూడున్నర లక్షలు ఇవ్వాలి" అన్నాడు ఆ రాబందు. ఇద్దరికీ నెత్తి మీద పిడుగు పడ్డట్టయింది.

"రోకట్లో తల పెట్టి రోకటి పోటుకు వెరవడం దేనికి? ఇంత దాకా వచ్చాక వెనకడుగు వేయటం మంచిది కాదు. ఎలాగోలా బేరం చేసి రెండున్నర లక్షలకు ఒప్పిద్దాం!" అన్నాడు వేణు బయటి కొచ్చాక.

"రెండున్నర లక్షలా ...? ఎక్క ణ్నుంచి వస్తాయి?" అన్నాను విస్తుపోతూ.

"ఇల్లుందిగా! అమ్మేసి కట్టేద్దాం. వచ్చే ఏడాది మరో ఇల్లు కొనుక్కోవచ్చు" అన్నాడు.

"మరి చెల్లి పెళ్లి ...?"

"దాని పెళ్లి కోసం లక్షల కట్నం ఇచ్చి వైభవంగా చేస్తాను. మొదట అమెరికా వెళ్లనీ!" అన్నాడు. అతని మొహంలో ఆశ మళ్లీ వెలుగుతూ.

వేణు వాళ్ల నాన్నగారు వెళ్లి బతిమాలుకుంటే మూడు లక్షలకు ఒప్పుకున్నాడు ఏజెంట్. ఆ తర్వాత విషయాలు చాలా వేగంగా జరిగిపోయాయి.

అమెరికాలోని ఓ సంస్థ వేణుకు ఉద్యోగం ఇవ్వటానికి అంగీకరించింది. టెలిఫోన్‌లో ఇంటర్వ్యూ కూడా జరిగింది. హెచ్ 1 వీసా వచ్చేసింది. విమానం టిక్కెట్లు రిజర్వ్ అయ్యాయి. వేణు అమెరికా వెళ్లే రోజు నాకు ఓ వైపు సంతోషం, మరో వైపు దాచుకున్నా దాగని ఈర్ష్య. ఆరు నూరైనా సరే, నేను కూడా అమరికా వెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నాను.

"నేను వెళ్లాక అక్కడి పరిస్థితులు వివరిస్తూ ఉత్తరం రాస్తాను. అప్పుడు కోర్సులో చేరుదువు గాని" అని భుజం తట్టాడు వేణు.

అందరి కళ్లల్లో ఆనందబాష్పాలు.

వేణు వెళ్లినప్పటి నుంచి ప్రతి రోజూ సాయంత్రం వాళ్లు అద్దె కుంటున్న ఇంటి కెళ్లి వారిని పరామర్శించి వస్తున్నాను. వేణు నుంచి ఉత్తరం రాగానే నలభై వేలు కట్టి కోర్సులో చేరాలని తహతహ, అసహనంతో ఎదురు చూపు. ఉత్తరం రాలేదు. వేణూయే తిరిగి వచ్చేశాడు.

అందరి మొహాల్లో పసిఫిక్ మహాసముద్ర మంత దిగులు!

నేను చాలా ఆందోళన పడుతూ అడిగాను ఏమైందని.

"ఇక్కడ కోర్సు చేసిన వా ళ్లెవరూ మెయిన్ ఫ్రేమ్ మీద పని చేయటానికి పనికి రారని తిప్పి పంపేశారు" అన్నాడు మొహం వేలాడేసి.

"అదేమిటీ? వాళ్లేగా సెలెక్ట్ చేసుకున్నారు?" అన్నాను కోపంగా.

"వాళ్లది తప్పు లేదు. ఇక్కడ మాకు సిమ్యులేటెడ్ మెయిన్ ఫ్రేమ్ మీద నేర్పించారు. అక్కడి కెళ్లాక మేము ఒరిజనల్ మెయిన్ ఫ్రేమ్ మీద పని చేయలేక పోయాం" అన్నాడు.

"అదేమిటీ ...?" అన్నాను అర్థం గాక.

"ఒక్కో మెయిన్ ఫ్రేమ్ కంప్యూటర్ ఖరీదు కోట్లలో ఉంటుంది. మన దేశంలో ఎక్కడా ఈ కంప్యూటర్లు లేవు. కనీసం అసెంబ్లింగ్ కూడా లేదు. అందువల్ల మెయిన్ ఫ్రేమ్ కోర్సులు నేర్పే సంస్థలన్నీ పీ.సీ. మీద ఎమ్యులేట్ చేసి మెయిన్ ఫ్రేమ్ వాతావరణం కల్పించి బోధిస్తున్నాయి. అందుకే ..." అన్నాడు.

అతని కళ్లలో నీళ్లు ఉబికాయి. నేను సముదాయించే లోపలే నన్ను పట్టుకుని భోరుమని ఏడ్చేశాడు. Ⓟ